క్లుప్తంగా

రాష్ట్ర డీజీని కలిసిన ఎయిమ్ జిల్లా కోఆర్డినేటర్

దెందులూరు: రాష్ట్ర ఫైర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్‌కుమార్‌ను ఎయిమ్ ఏలూరు జిల్లా కోఆర్డినేటర్, రాష్ట్ర స్పెషల్ టీం మెంబర్ పోడేటి రాంబాబు కలిశారు. సీఐడీ చీఫ్ నుంచి రాష్ట్ర డీజీగా పదోన్నతి లభించిన నేపథ్యంలో ఆయన అభినందించారు. ఏలూరు జిల్లాలో ఎయిమ్ సంస్థ సేవా కార్యక్రమాలు అమలు తీరును వివరించారు. పీవీ సునీల్‌కు మార్ పోలీస్ శాఖలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని రాంబాబు ఆకాంక్షించారు.

ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ

దెందులూరు: గాలాయగూడెం రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అధ్యక్షతన ఈ-క్రాప్ సోషల్ ఆడిట్ జరిగింది. మండల వ్యవసాయశాఖాధికారి గద్దె రమేష్, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది సమక్షంలో ఈ-క్రాప్ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వో పీ.విష్ణు ఉన్నారు.

శ్లాబ్‌ను పరిశీలించిన ఏఈ



సానిగూడెం హెల్త్‌క్లినిక్ సెంటర్ శ్లాబ్‌ను పరిశీలిస్తున్న ఏఈ

దెందులూరు: సానిగూడెంలోని రూ.17.50 లక్షలతో నిర్మిస్తున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు బుధవారం శ్లాబ్ నిర్మాణం చేపట్టారు. సర్పంచ్ శనపల్లి విష్ణు శ్లాబ్ పనులను ప్రారంభించారు. పంచాయతీ రాజ్ దెందులూరు అసిస్టెంట్ ఇంజనీర్ జీఎస్‌వీ రవీంద్రనాథ్ చౌదరి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఫ్రాన్సిస్ పరిశీలించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సిబ్బందికి, అసిస్టెంట్ ఇంజనీర్‌కు ఏఈ సూచించారు.

ఘనంగా భీమేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



గాలాయగూడెంలోని భీమ నాగలింగేశ్వరస్వామి

దెందులూరు: గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ ప్రాంగణంలోని భీమ నాగలింగేశ్వరస్వామి 5వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవం, స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పనుల పండుగగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదమంత్రాల నడుమ శివపార్వతులకు కల్యాణం కార్యక్రమంలో గ్రామంలోని పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాల్లోని భక్తులకు మహాఅన్నసమారాధన నిర్వహించారు.

చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు



కాశిపాడులో పిల్లలకు టీకాలు వేస్తున్న దృశ్యం

గణపవరం: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని ఆరోగ్య సహాయకుడు నామాల రాజు అన్నారు. బుధవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కాశిపాడులో వ్యాధినిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నెలలో మొదటి, మూడవ బుధవారాల్లో వ్యాధినిరోధక టీకాలు ఇస్తామన్నారు. గర్భిణులకు రెండు డోసుల టీడీ ఇంజెక్షన్లు, 180 ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శివకుమారి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు నిడమర్రులో విద్యుత్ సరఫరా నిలుపుదల

నిడమర్రు: నిడమర్రుతోపాటు పెదనింద్రకొలను విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్లు, స్తంభాల మరమ్మతుల నిమిత్తం, సబ్‌స్టేషన్ నిర్వహణ నిమిత్తం సరఫరా కట్ చేస్తున్నామన్నారు.

యర్రమిల్లిపాడులో దోమ తెరల పంపిణీ

ఉంగుటూరు: యర్రమిల్లిపాడులో మంగళవారం దూబచర్ల ఆమెన్ ట్రస్టు సౌజన్యంతో 72 మందికి సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దోమతెరలు పంపిణీ చేశారు. వైద్యాధికారి వర్మ, మలేరియా యూనిట్ అధికారి లక్ష్మణరావు, ట్రస్టు వ్యవస్థాపకురాలు ఎవాంజిలీన్ పాల్గొన్నారు. సామాజిక ఆరోగ్య అధికారి కె. పద్మ, వీవీ నాగలక్ష్మి ఆరోగ్య కార్యదర్శి సంధ్య, ఎంఎల్ సోని, వెంకటస్వామి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- చివరి నిమిషంలో పరుగులు తీసిన విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పర్యవేక్షించిన అధికారులు



భీమడోలులో చివరి నిమిషంలో పరుగులు తీస్తున్న విద్యార్థి



పోలసానిపల్లిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

భీమడోలు: జూనియర్ ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఒక్క నిమిషం అలస్యమైనా పరీక్షా కేంద్రానికి విద్యార్థులను అనుమతించలేదు. దీనితో చివరి నిమిషంలో వచ్చే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు పరుగులు తీసారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన ఏర్పాటు చేసారు. ప్రతి విద్యార్థినీ చెక్ చేసి పరీక్షా కేంద్రానికి పంపారు. కేంద్రాల 144 సెక్షన్‌ను అమలు చేసారు. సెల్‌ఫోన్లను అనుమతించలేదు. మండలంలోని భీమడోలు వేంకటేశ్వర జూనియర్, పోలసానిపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లోని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరా నిఘా ఏర్పాటు చేశారు. తొలి రోజు భాషకు సంబంధించిన తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షా కేంద్రాల్లో భీమడోలు, పోలసానిపల్లి, ద్వారకాతిరుమల, గుండుగొలను, గుణ్ణంపల్లిల్లోని జూనియర్ ఇంటర్ విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాసారు. భీమడోలు వేంకటేశ్వర జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 172 మంది విద్యార్థులకు 17 మంది గైర్హాజరు కాగా 155 మంది పరీక్షలు రాసారని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ చంద్రావతి తెలిపారు. పోలసానిపల్లి బాలికల గురుకుల కళాశాలలో 203 మందికి 11 మంది గైర్హాజరు కాగా 192 మంది పరీక్షలు రాశారు. ఒకేషనల్ కోర్సులకు చెందిన ఏడుగురిలో ఇద్దరు గైర్హాజరు కాగా ఐదుగురు పరీక్ష రాసారని చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. కేంద్రాల వద్ద మహిళా పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లు ప్రత్యేక నిఘా ఉంచారు. పీహెచ్‌సీ సిబ్బంది వైద్య సహాయం చేసారు. గురువారం సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం మొదటిరోజున ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయడానికి 136 మందికి అనుమతి వచ్చింది. 16 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఒకరికి అనుమతిరాగా ఆ విద్యార్థి పరీక్షకు హాజరుకాలేదు. పరీక్ష కేంద్రాన్ని డీవైఈవో బి. ప్రభాకరరావు పరిశీలించారు. ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసరావు, పరీక్షల చీఫ్ సూపరిండెంటుగా పి.వెంకటేశ్వరరావు, డిపార్టుమెంటల్ అధికారి దేవరాజు పర్యవేక్షించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

గణపవరం: గణపవరం ప్రభుత్వ జూనియర్ కాలేజిలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటిరోజు తెలుగు పరీక్షకు 107 మందికి 98 మంది, హిందీ పరీక్షకు 20 మంది, సంస్కృతం పరీక్షకు 153 మందికి 152 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ ఎం.రఘు తెలిపారు. గణపవరం ఎంపీడీవో జ్యోతిర్మయి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, వసతుల కల్పనపై ఆరా తీశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

డ్రైడే ద్వారా దోమల వృద్ధి నివారణ



దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు సిబ్బంది

పెదపాడు: దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు చక్రధర్ తెలిపారు, ఆశాడే సందర్భంగా బుధవారం పెదపాడు మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ దోమకాటు చాలా చిన్నదని కానీ దాని ద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా మనుషులకు సక్రమింగే అవకాశం ఉందని చెప్పారు. ఫ్రైడే డ్రై డే నిర్వహించడం ద్వారా దోమల వ్యాప్తిని కొంతవరకు అరికట్టవచ్చనని చెప్పారు. ఏఎన్ఎం ఆశాడే కార్యక్రమం నిర్వహించి ఆశా కార్యకర్తలు అంటువ్యాధులు అరికట్టడంలో కీలక పాత్ర పోషించాలని చెప్పారు. క్రమం తప్పకుండా ఫీవర్ సర్వే నిర్వహించి, జ్వర బాధితులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. అదనపు వైద్యాధికారి అనంత్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి జగనన్న గోరుముద్దలో రాగి జావ



దేవరగోపవరం స్కూల్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో శేషు

నిడమర్రు: జగనన్న గోరుముద్ద పథకంలో ఈనెల 21 నుంచి రాగి, బెల్లం మిశ్రమ జావ ఉదయం పూట విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. బుధవారం దేవరగోపవరం పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలకు రాగి జావ తయారికీ సంబంధించిన రాగి పిండి, బెల్లం పౌడర్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటి వివరాలు ఐఎంఎంఎస్ యాప్‌లో నమోదు చెయ్యాలన్నారు. 21న విద్యార్థుల తల్లిదండ్రులను, స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారి సమక్షంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించాల్సిన భోజన పథకం, జగనన్న విద్యాకానుక, నిధుల నిర్వహణ వంటి రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయుల టీచర్స్ డైరీలు, పాఠ్యప్రణాళికలు తనఖీ చేసి తగిన సూచనలు అందించారు. ఈ నెలలో జరిగే పాఠశాలల వార్షిక తనిఖీలకు అన్ని రికార్డులు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట జిల్లా ఏసు ఉన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న వాహనదారులు



సరిపల్లెలోని ప్రమాదకర మలుపు

గణపవరం: గణపవరం ఆర్అండ్ సెక్షన్ పరిధిలో పలుచోట్ల రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా తయారయ్యాయి. గణపవరం నుంచి తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు వైపు వెళ్లే రహదారులపై కొన్నిచోట్ల ఎల్ ఆకారంలో, మరికొన్నిచోట్ల జెడ్, ఎస్ ఆకారంలో మలుపులు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారులపై మలుపుల వద్ద రోజూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు త్రుటిలో బయట పడిన సందర్భాలనేకం. గణపవరం-తాడేపల్లిగూడెం రహదారిలో గణపవరం సెంటర్‌కు అతి సమీపంలో బండిరేవు వద్ద ఎల్ ఆకారంలో ఉన్న మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. ఇక్కడ వాహనదారులు బిక్కు బిక్కు మంటూ ప్రయాణిస్తారు. బొబ్బిలి వంతెన దిగువన మూడు రోడ్ల కూడలిలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఏలూరు వైపు వెళ్లే వాహనాలు, ఆకివీడు వైపు నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పుకోవడం ఆటోలకు, మోటార్ సైక్లిస్టులకు గగనంగా ఉంటుంది. భీమవరం వైపు వెళ్లే రహదారిలో సరిపల్లె వెలంపేట వద్ద, బీసీ కాలనీల వద్ద ఉన్న ఎల్ ఆకారపు మలుపులలో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. బాలయ్య చెర్వు మలుపు వద్ద మార్జిన్‌లో వాహనాలు నిలుపుదల చేసి ఉండటంవల్ల కూడా ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడం ఇబ్బందికరంగా ఉంటోంది. మందలపర్రు వంతెన వద్ద, నాగనమిల్లి పుంత మునలమ్మ గుడివద్ద ఉన్న మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. మందలపర్రు వంతెన మలుపు గమనించక ఇటీవలే ఒకలారీ, మరో టాక్సీ మలుపు వద్ద కాల్వలోకి దూసుకుపోయాయి. నాగనమిల్లి ఎస్‌టర్నింగ్‌లో అనేక ప్రమాదాలు జరిగాయి. సమీపంలోకి వస్తే తప్ప ఈమలుపులో వాహనాలు కనిపించవు. ఇక అత్యంత ప్రమాదకరమైన మలుపు రాచూరు వద్ద ఉంది, ఎల్ ఆకారంలో ఉండే మలుపులో రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల ఎదురుగావచ్చే వాహనాలు ఐదారు అడుగుల సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. గ్రామాల పరిధిలో ఇలాంటి ప్రమాదకర మలుపుల వద్ద రోడ్డు మార్జిన్‌లను సమీప దుకాణాలవారు ఆక్రమించుకోవడం, ఊరిబయట మలుపుల్లో తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇలాంటి మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణలు, మార్గ సూచికలు ఏర్పాటుచేస్తే కొంతైనా ఫలితం ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు.



పిప్పర కనకదుర్గ గుడివద్ద ప్రమాదకర మూడురోడ్ల కూడలి



నాగనమిల్లి వద్ద ఎస్ ఆకారంలో మలుపు



గణపవరం సెంటర్ బండిరేవువద్ద ఇరుకైన మలుపు

క్షయవ్యాధి నివారణకు సహకరించాలి



జల్లికొమ్మరలో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సంతోష్

గణపవరం: క్షయవ్యాధి పూర్తిగా నయమయ్యే వ్యాధి అని, దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమవ్వుతుదని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. బుధవారం గణపవరం మండలం జల్లికొమ్మరలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ కార్యక్రమంలో భాగంగా డా.వైఎస్సార్ క్లినిక్‌లో ఆరోగ్యమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. 15రోజులకు మించి జ్వరం, దగ్గు, దగ్గులో కఫం, రక్త పడుతుండటం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి కళ్లె పరీక్ష చేయించుకోవాలని సూచించారు. సకాలంలో క్షయవ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. క్షయను నిర్లక్ష్యం చేయకుండా నివారణకు సహకరించాలని కోరారు. ప్రతి నెలా 14న గ్రామంలో ఆరోగ్యమేళా నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో 51 మందికి కంటివెలుగు అధికారి శ్రీనివాస్ పరీక్షలు నిర్వహించి వీరందరికీ కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. కళ్లజోళ్లు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. మెడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్యకార్యకర్తలకు వివిధ సమస్యలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ పాల్గొన్నారు.

భీమడోలు గేటు మీదుగా రాకపోకలు

ట్రాక్ మరమ్మతు పనుల పూర్తి



భీమడోలులో రైల్వే గేటు మీదుగా వాహనాలు రాకపోకలు

భీమడోలు: జాతీయ రహదారికి అనుకుని ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు పూర్తి కావడంతో బుధవారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ట్రాక్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు మూసి వేస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి గడువు కన్నా ముందుగానే పూర్తి చేసారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బీటీ రోడ్డు నిర్మించారు. దీనితో బుధవారం ఉదయం నుంచే గేటు తెరచుకుంది. ప్రధానంగా భీమడోలు వారపు సంత కావడంతో వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీనితో గేటు మీదుగా భారీ వాహనాలు రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.

ఆక్రమణల తొలగింపునకు బ్రేక్

ఉంగుటూరు: మండలంలో గోదావరి కాలువ గట్ల వెంబడి ఆక్రమణలు తొలగించే ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేకు పడింది. సంబంధిత అధికారులకు బాధితుల నుంచి ఒత్తిడి పెరిగింది. విజయవాడకు చెందిన ఓ వ్యక్తి కోర్టులో వ్యాజ్యం వేయడంతో వారి ఆదేశంతో ఆక్రమణలు తొలగింపునకు కలెక్టరు ఆదేశాలిచ్చారు. దాంతో రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ అధికార్లు సుమారు 700 వరకు ఉన్న ఆక్రమణదార్లకు నోటీసులిచ్చారు. నివాసాలు మినహా మిగిలిన పశువులు పాకలు, గడ్డిమేట్లు కొంతమేర తొలగించారు. మిగిలిన ఆక్రమణలు తొలగించే క్రమంలో ఒత్తిడి పెరగడంతో ఈ ప్రక్రియను వాయిదా వేసినట్లు సమాచారం. ఈ విషయంపై తహసీల్దార్ వెంకటరమణను వివరణ అడగ్గా పోలీసులు సహకారంతో ఆక్రమణలు త్వరలో తొలగిస్తామని తెలిపారు. ప్రస్తుతం పోలీసులు బందోబస్తు నిమిత్తం అమరావతి వెళ్లడంతో వాయిదా వేయాల్సి వచ్చిందని ఆయన వివరించారు. ఆక్రమణదార్లు కొంతమంది కోర్టు స్టే కోసం వెళ్లారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి



కూచింపూడిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘ నేత శ్రీనివాస్

పెదవేగి : దిగుబడి రాక నష్టపోతున్న సీడ్, కమర్షియల్ మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెదవేగి మండలంలోని పెదవేగి, కూచింపూడిలో ఆయన పర్యటించి సీడ్, కమర్షియల్ మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంట దిగుబడి, పెట్టుబడి ఖర్చులు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సీడ్, కమర్షియల్ మొక్కజొన్న పంట రైతులు చేతికి వచ్చిందని చెప్పారు. గతేడాది కంటే వాతావరణ మార్పులు, తెగుళ్లు, ఇతర కారణాలతో దిగుబడులు తగ్గి రైతుల నష్టపోతున్నారని తెలిపారు. కౌలు, పెట్టుబడి కలిపి ఎకరా సాగుకు రూ.80 వేలకు పైగానే ఖర్చు అవుతోందని చెప్పారు. దిగుబడి మూడు టన్నులకు మించి రావడం లేదని అన్నారు. సీడ్ కంపెనీలు టన్నుకు రూ.25 వేలు ఇస్తున్నాయని ఫలితంగా మొక్కజొన్న కౌలు రైతులు నష్టపోతున్నారని అన్నారు. సీడ్ కంపెనీలు రైతులను ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తెరిచి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె. నాగేశ్వరరావు పలువురు మొక్కజొన్న రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం కావాలి

దెందులూరు: జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వేగవంతం చేయాలని రెవెన్యూ, గృహనిర్మాణ, పంచాయతీ ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని కోరారు. గృహనిర్మాణ శాఖ దెందులూరు మండల అసిస్టెంట్ ఇంజనీర్ కావ్య, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు ఆధ్వర్యంలో అలుగులగూడెం జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు, రోడ్డు, పైప్‌లైన్ల పనులు ఆలస్యం లేకుండా వేగవంతంగా పూర్తవుతున్నాయన్నారు. లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి త్వరితగతిన అందించేందుకు స్థానికంగా గోడౌన్ సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ వార్డు మెంబర్ కాంద్రు ప్రసన్న, నాయకులు రవి, గ్రామస్తులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ ఉన్నారు.

నీట్ పరీక్ష ఫలితాల్లో మెరిసిన ప్రదీప్



కానుమిల్లి ప్రదీప్, 389 ర్యాంకు

భీమడోలు: నీట్ పీజీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో కురెళ్లగూడెంకు చెందిన కానుమిల్లి ప్రదీప్ జాతీయస్థాయిలో 389 ర్యాంకు సాధించి సత్తా చాటాడు. కురెళ్లగూడెంకు చెందిన కానుమిల్లి కృష్ణమోహన్‌గా కుమారుడు ప్రదీప్ పీజీ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. భీమడోలులో ప్రదీప్ తండ్రి కృష్ణమోహన్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. పీజీ 23016812 హాల్ టికెట్ నంబర్ గల ప్రదీప్ జాతీయస్థాయిలో 389 ర్యాంకు పొందాడన్నారు. 2016లో జరిగిన నీట్ పరీక్షలో జాతీయస్థాయిలో 588 ర్యాంకు సాధించి తెలంగాణాలోని సిద్ధిపేటలోని ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసారు. పీజీ పరీక్షల్లో 389 ర్యాంకు సాధించాడని పేర్కొన్నారు. ప్రదీప్ ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు భీమడోలులోని మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చదువుకున్నాడన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రదీప్ జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకు పొందడంపై మానస స్కూలు ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రేపటి నుంచి పల్లాలమ్మవారి వార్షిక జాతర



పల్లాలమ్మవారు

నిడమర్రు: చానమిల్లి గ్రామ దేవత పల్లాలమ్మవారి వార్షిక మహోత్సవం ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 17న ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి మంగళ స్నానాలు కలశస్థాపన పూజలు, అనంతరం అఖండ జ్యోతి ప్రజ్వలనతో సామూహిక కుంకుమ పూజలతో జాతర ప్రారంభమవుతోందన్నారు. గగర నృత్యాలు, విచిత్ర వేషధారణలు, నాదస్వర సంగీతం, అఘోరా డ్యాన్స్, బుట్టబొమ్మలతో రాత్రి 8 గంటల నుంచి అమ్మవారి సేవ ఉంటుందన్నారు. ఈ సేవ 18వ తేదీ రాత్రి వరకూ నిర్వహించనున్నారు. 19న 4గంటలకు జానపద నృత్యాలు, భరతనాట్యం, 8 గంటల నుంచి సత్య ఆర్కెస్ట్రా సినీ మ్యూజికల్ నైట్, 20 రాత్రి స్వాతీ ఆర్కెస్ట్రా, 21 ఉదయం 10 గంటల నుంచి అన్న సమారాధన, రాత్రికి రామాంజనేయుల యుద్ధం, సత్యహరిచ్చంద్ర నాటకాలను ప్రదర్శించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారన్నారు.